సాక్షి
ప్రకాశం
శనివారం। 30। ఆగస్టు। 2025



ఊళ్లకు బెల్ట్ ఉచ్చు.. కుటుంబాల్లో చిచ్చు !

ఊరూరా మద్యం బెల్టు షాపులు బడ్డీ కొట్లలా వెలుస్తున్నాయి. కూటమి నేతలే బెల్టుషాపులు నిర్వహిస్తూ వేళా పాళా లేకుండా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. - 8లో..



గుప్తనిధులు తవ్విన ఆరుగురికి సంకెళ్లు

వివిధ ఆలయాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు సాగిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35 /26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.



కిక్కివ్వని బార్లు!

ఇప్పటికే మద్యం దుకాణాలను తమగుప్పెట్లో పెట్టుకున్న అధికార కూటమి నేతలు బార్లపైనా కన్నేసినట్టు ప్రచారం జోరుగా సాగుతోంది. బార్లకు దరఖాస్తు చేయకుండా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే వ్యాపారులతో సిండికేట్ అయి రహస్య సమావేశాన్ని సైతం నిర్వహించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం మీద పరోక్షంగా ఒత్తిడి తీసుకొచ్చి తక్కువ ఫీజులతో బార్లను కొట్టేయాలన్న వ్యూహంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో 29 బార్లు ఉండగా తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడం పై ప్రచారాలకు బలం చేకూరుస్తున్నాయి. శనివారం 20 బార్లకు డ్రా తీయనున్నారు.

- బార్లకు దరఖాస్తులలో సిండికేట్ల మాయాజాలం
- జిల్లాలో అంతంత మాత్రంగానే దరఖాస్తులు
- గురువారం వ్యాపారుల అత్యవసర సమావేశం
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో నిర్వహణ
- ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా దరఖాస్తు చేయకూడదని నిర్ణయం
- 29 బార్లకు కేవలం 91 దరఖాస్తులు
- ప్రభుత్వం ఆశించింది 116 దరఖాస్తులు
- చివరి ఐదు గంటల్లో 61 దరఖాస్తులు
- 20 బార్లకు నేడు డ్రా

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం ప్రకటించిన 2025–28 బార్ పాలసీ తుస్సుమంది. ప్రభుత్వం నిర్దేశించుకున్న మేర దరఖాస్తులు రాకపోవడంతో ఆశాఖ అధికారులు అయోమయంలో పడిపోయారు. కొత్త వ్యాపారుల చేత దరఖాస్తు చేయించాలని చేసుకున్న ప్లాన్ తిరగబడింది. ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీస్తామని, లేకపోతే దరఖాస్తుదారుల ఫీజు డబ్బులను వాపసు ఇస్తామని ప్రభుత్వం చెప్పినా వ్యాపారులలో కదలిక కనిపించడంలేదు. దీనికి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తెరవెనుక పన్నిన పన్నాగమేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దరఖాస్తుల కోసం గడువు పెంచినా..

ఈనెల 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం కొత్తబార్ పాలసీ ప్రకటించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో 18వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించడం మొదలు పెట్టింది. 26వ తేదీ నాటికి గడువు ముగుస్తుందని, 28వ తేదీ డ్రా నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. దరఖాస్తుకు నాన్ రిఫండ్ కింద రూ.5 లక్షల ఫీజు, ప్రాసెసింగ్ చార్జీలు రూ.10 వేలుగా నిర్ణయించారు. లైసెన్స్ ఫీజును రెండు శ్లాబులుగా విభజించారు. 50 వేల జనాభాలోపు ఉన్న ప్రాంతాల్లో రూ.35 లక్షల ఫీజు, 50 వేల జనాభా దాటిన పట్టణాలకు రూ.55 లక్షల లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. జిల్లాలో ఓపెన్ కేటగిరీలో 26 బార్లు, గీతకార్మికులకు కేటాయించిన 10 శాతం నుంచి 3 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గడువు తేదీలోపు ప్రభుత్వం ఆశించిన మేర దరఖాస్తులు రాలేదు. దాంతో మరో మూడు రోజుల గడువు పెంచి ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించింది. అయినా పెద్దగా వ్యాపారులు దరఖాస్తు చేయడానికి ముందుకు రాలేదు. ఎక్సైజ్ అధికారులకు టార్గెట్లు పెట్టి దరఖాస్తుల కోసం ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లో ...

మద్యం సిండికేట్ తరహాలోనే బార్లకు వ్యాపారులు సిండికేట్‌గా తయారైనట్లు ఆరోపణలు ఉన్నాయి. గురువారం గుంటూరులో సమావేశమైన సిండికేట్ వ్యాపారులు ప్రస్తుతం బార్లకు దరఖాస్తు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మద్యం వ్యాపారాన్ని తమ గుప్పిట్లో తీసుకొని నడిపిస్తున్న అధికార తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలోనే ఈ సమావేశం జరిగినట్లు ప్రచారం సాగుతోంది. ఆశించిన మేర దరఖాస్తులు రాకపోతే ప్రభుత్వం మీద పరోక్షంగా ఒత్తిడి వస్తుందని, అప్పుడు దరఖాస్తు ఫీజుతో పాటుగా లైసెన్స్ ఫీజులను తగ్గించే అవకాశం ఉంటుందని సిండికేట్లు భావిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో వ్యాపారులంతా కట్టకట్టుకొని దరఖాస్తులు చేయకుండా దూరంగా ఉండిపోయారు. ఫలితంగా జిల్లాలో ఊహించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలే చక్రం తిప్పడం చర్చనీయాంశంగా మారింది. ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు నుంచి బార్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కొత్త వ్యాపారులు ఆసక్తి చూపించినా ఎమ్మెల్యేల అనుచరుల బెదిరింపులకు భయపడి ముందుకురాలేదని తెలుస్తోంది. ఒకవేళ వారి బెదిరింపులకు భయపడకుండా దరఖాస్తు చేసుకున్నప్పటికీ సజావుగా వ్యాపారం చేసుకోనిస్తారో లేదోనని వ్యాపారులు వెనకంజ వేస్తున్నారని తెలుస్తోంది.

91 దరఖాస్తులు మాత్రమే...

బార్ పాలసీలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలిందని వ్యాపారులు చెప్పుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 29 బార్లకు గాను 116 దరఖాస్తులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ 29వ తేదీ సాయంత్రం లోపు కేవలం 91 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వం అంచనా వేసిన దానికి 25 దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. ఓపెన్ కేటగిరీలో 78 దరఖాస్తులు, రిజర్వేషన్ కేటగిరిలో 13 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓపెన్ కేటగిరిలో 17 బార్లకు, రిజర్వేషన్ కేటగిరీలో 3 బార్లకు ప్రకాశం భవనంలోని స్పందన హాలులో శనివారం డ్రా తీయనున్నారు. మిగతా 9 బార్లకు ఒకటీ అర దరఖాస్తులు రావడంతో వాటికి డ్రా వేయడం లేదు. అయితే శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల వరకు కూడా కేవలం 27 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రభుత్వ ఒత్తిడిని తట్టుకోలేక రంగంలోకి దిగిన ఎక్సైజ్ అధికారులు పాత వ్యాపారుల చేత బలవంతంగా దరఖాస్తు చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. అతికష్టం మీద 20 బార్లకు దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. చివరి గంటల్లో దాదాపు 64 దరఖాస్తులు రావడంపై పలు కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

ఏఆర్ఈటీ ట్యాక్స్‌తో తలనొప్పి...

బార్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి పాత వ్యాపారులు కూడా పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. అందుకు కారణం అడిషనల్ రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్ఈటీ). సరుకు కొనుగోలు మీద 15 శాతం ఏఆర్ఈటీ విధించినట్లు వ్యాపారులు చెప్పుకుంటున్నారు. ఒక వ్యాపారి రూ.30 లక్షల సరుకు కొనుగోలు చేస్తే రూ.4.50 లక్షల ఏఆర్ఈటీ చెల్లించాల్సి వస్తుంది. దాంతో వ్యాపారులు బార్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ముందుకు రావట్లేదని తెలుస్తోంది. ఇంత పెద్ద మొత్తంలో ఏఆర్ఈటీ చెల్లించడం అసాధ్యమన్న వాదన వినిపిస్తోంది.

న్యూస్‌రీల్

ఐక్యతా 'బాట'

- కొట్టుకుపోయిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టిన గ్రామస్తులు
- అందరూ ఒక్కటై బాగుచేసుకున్న వైనం



కల్వర్టుకు మరమ్మతులు చేసుకుంటున్న గ్రామస్తులు

పెద్దదోర్నాల: ఎవరో వచ్చి బాగుచేయిస్తారని ఎదురుచూడకుండా తమ గ్రామానికొచ్చే మార్గంలో దెబ్బతిన్న కల్వర్టును గ్రామస్తులంతా ఏకమై మరమ్మతులు చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని గంటవానిపల్లెలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తీగలేరు వాగుపై నిర్మించిన లోలెవల్ కల్వర్ట్ కొట్టుకుపోయింది. దీంతో విద్యుత్ స్తంభాల సహాయంతో వాగును దాటిన గ్రామస్తులు దీనికి పరిష్కార మార్గంగా కల్వర్టుకు మరమ్మతులు చేయాలని నిర్ణయించుకున్నారు. అంతే అనుకున్నదే తడవుగా గ్రామస్తులంతా ఒక్క తాటిపై వచ్చి కల్వర్ట్‌కు అడ్డంగా వరద నీరు ప్రవహించేలా పైపులు ఏర్పాటు చేశారు. దీంతో పాటు రహదారి యావత్తూ రాళ్లతో పూడ్చి వాహనాల రాకపోకలను పునరుద్ధరించుకున్నారు. అధికారులు, రాజకీయ నాయకుల కోసం ఎదురు చూడకుండా గ్రామస్తులే కల్వర్ట్‌కు మరమ్మతులు నిర్వహించుకోవటాన్ని పలువురు అభినందిస్తున్నారు.

ఇన్‌చార్జ్ డీపీఓగా ముప్పూరి

- 15 రోజులపాటు సెలవులో వెళ్లిన వెంకట నాయుడు



ముప్పూరి వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా ముప్పూరి వెంకటేశ్వరరావును నియమిస్తూ కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన ఉత్తర్వుల్లో జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును వెంటనే బాధ్యతలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు డీపీఓగా పనిచేసిన జి.వెంకట నాయుడు సెప్టెంబర్ 9వ తేదీ వరకు సిక్ లీవ్‌లో వెళ్లినట్లు పేర్కొన్నారు.

ఐదుగురు సీనియర్ సహాయకులకు పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు సిటీ: ఒంగోలు జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం పరిధిలోని వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఐదుగురు సీనియర్ సహాయకులకు పరిపాలనాధికారులుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శుక్రవారం తెలిపారు. ఈ ఐదుగురిని పదోన్నతుల పై కె.శ్రీదేవి వేటపాలెం ఎంపీడీఓ కార్యాలయం, బి.శకుంతలను పర్చూరు, ఎం.జాఫర్ ఆలీబేగ్‌ను పెద్దారవీడు, డీఎస్.మనోహరరావు ను కనిగిరి, పి.శ్రీనివాసులును సీఎస్.పురం ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ చేసినట్లు తెలిపారు. పదోన్నతి ఉత్తర్వులు అందించే కార్యక్రమంలో వెంకాయమ్మతో పాటు జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీవైఈఓ బాలమ్మ, పరిపాలనాధికారి చల్లా శ్రీనివాసకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

ఒంగోలు వన్‌టౌన్: ప్రతి అసంఘటిత రంగ కార్మికుడు ఈశ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని గుంటూరు జోన్ సంయుక్త కమిషనర్ సీహెచ్ ఆషా రాణి సూచించారు. ఒంగోలు ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం కేంద్రం ప్రవేశ పెట్టిన ఈ అవకాశాన్ని ప్రతి కార్మికుడు ఉపయోగించుకోవాలన్నారు. నమోదు అయిన ప్రతి సభ్యుడికి కేంద్ర ప్రభుత్వం సామాజిక భద్రతతో పాటూ, అంగ వైకల్యం కలిగినా, ప్రమాదవశాత్తు మరణించినా కుటుంబానికి రూ.2 లక్షల వరకు ఆర్థిక భద్రత కల్పిస్తారన్నారు. 16 నుంచి 59 సంవత్సరాల మధ్య ఉన్న అసంఘటిత రంగ కార్మికులందరూ తమ ఆధార్ కార్డుతో పాటూ లింకు అయిన ఫోన్, బ్యాంక్ ఖాతా వివరాలు తీసుకుని, సమీపంలోని సీఎస్‌సీ సెంటర్ లేదా కార్మిక శాఖ కార్యాలయంలో ఈ శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. వాణిజ్య వాహనాల యజమానులు తప్పని సరిగా తమ వాహనాలను కార్మిక శాఖలో మోటార్ రవాణా కార్మికుల చట్టం కింద నమోదు చేసుకోవాలన్నారు.


క్యాడర్‌కు అండగా నిలుస్తా

- చంద్రబాబు మోసాలను ఎండగడదాం
- ఎస్ఎన్‌పాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున



గుండ్లాపల్లిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ ప్రదర్శిస్తున్న మేరుగు నాగార్జునతో నాయకులు

మద్దిపాడు: కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో పలు హామీలు ఇచ్చారని, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా నెరవేర్చలేదని అన్నారు. చంద్రబాబు చెప్పేది ఒకటి చేసేదొకటి అన్న విషయం ప్రజలకు తెలిసినా 2024 ఎన్నికల్లో మరోమారు మోసపోయారని ఆయన అన్నారు. రైతులకు పూర్తిగా అండగా నిలుస్తానని, వారికి మద్దతు ధరలు ప్రకటించి రైతులను ఆదుకుంటానని చెప్పిన చంద్రబాబు పొగాకు రైతుల నడ్డి విరిచారని అన్నారు. డ్వాక్రా మహిళలకు అది చేస్తాం ఇది చేస్తామంటూ ఊదరగొట్టిన చంద్రబాబు ఒక్క సిలిండర్ అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నాడని విమర్శించారు. ప్రతి విషయంలోనూ చంద్రబాబు దాటవేత ధోరణి అవలంబిస్తున్నాడని, ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నాడని అన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన పార్టీ కార్యకర్తలకు తాను అండగా నిలుస్తానని, ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి తన వంతు ప్రయత్నాన్ని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలకు చంద్రబాబు మోసాలను తెలపడానికే క్యూఆర్ కోడ్ ను ఏర్పాటు చేశారని, గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ చంద్రబాబు మోసాలను తెలుపుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేసి వైఎస్ జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. గ్రామ పార్టీ అధ్యక్షునిగా జవ్వాజి లక్ష్మీనారాయణ రెడ్డిని ఎంపిక చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ ఉపాధ్యక్షుడు వాకా కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులు, ఎంపీటీసీ పల్లకి పద్మ, నాయకులు వల్లంరెడ్డి బాలాంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, పల్లపాటి అన్వేష్, నాదెండ్ల మహేష్, రాయపాటి విల్సన్, డేనియల్, భాను చంద్ర, కంకణాల సురేష్, గ్రామ నాయకులు యేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, పల్లకి సత్యనారాయణ రెడ్డి, లింగ సంజీవరెడ్డి, తదితర నాయకులు పార్టీ కార్యకర్తలు అభిమానులు పలువురు పాల్గొన్నారు.



ఒంగోలు దక్షిణం బజారులో శంఖువులతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

ఏకదంతాయ.. భిన్న రూపాయ

వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో వివిధ రూపాలలో గణేష్ ప్రతిమలను ఉంచి పూజిస్తున్నారు. ఒంగోలు నగరంలో భారీ విగ్రహాలను ఆకట్టుకునే సెట్టింగుల మధ్య అలంకరించారు.

మాతా శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

- డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు



కిల్కారి కాల్స్‌పై ఆశా నోడల్ ఆఫీసర్లతో సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

ఒంగోలు టౌన్: గర్భిణుల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కిల్కారీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు చెప్పారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఆశా నోడల్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాలను తగ్గించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కిల్కారి సేవలను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. గర్భిణిగా నిర్ధారణ అయిన 4వ నెల నుంచి బిడ్డ పుట్టి ఏడాది వయసు వచ్చే వరకు కిల్కారి కాల్స్ వస్తుంటాయని వివరించారు. వారానికి ఒకసారి వచ్చే ఈ కాల్ నిడివి కేవలం 2 నిముషాలు ఉంటుందని, రెండు నిముషాలను కేటాయిస్తే జీవితాంతం ఉపయోగపడే సమాచారం లభిస్తుందని చెప్పారు. కిల్కారీ కాల్ వచ్చినప్పుడు గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా వినాలని సూచించారు. కిల్కారి కాల్ కోసం తమ మొబైల్ ఫోన్లలో 911600103660 నంబర్‌ను సేవ్ చేసుకోవాలని చెప్పారు. ఒకవేళ కాల్ మిస్సయితే 14423 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి వినవచ్చన్నారు. అనంతరం జులై మాసంలో కిల్కారి రిసీవర్స్ పెంచిన ఆశా వర్కర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎం రాజేశ్వరి, కిల్కారి రీజినల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు పాల్గొన్నారు.

సోలార్ పథకానికి భూములు కేటాయించాలి

- సమీక్షలో జేసీ గోపాలకృష్ణ



విద్యుత్, రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కుసుమ్ సోలార్ పథకానికి జిల్లాలో భూములు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ ఆదేశించారు. ఆయన తన ఛాంబర్‌లో ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, విద్యుత్ అధికారులు, నెడ్‌క్యాప్, రెవెన్యూ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఫీడర్ లెవల్ సోలరైజేషన్ ప్రోగ్రాం కోసం భూ కేటాయింపులు వేగంగా జరగాలన్నారు. అందుకోసం 121.75 ఎకరాల ప్రభుత్వ భూమి, 378 ఎకరాల పట్టా భూములను గుర్తించినట్లు అధికారులు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పట్టా భూముల విషయంలో రైతుల అంగీకారంతో ఆయా భూములను లీజు ఆధారంగా సేకరించి భూ కేటాయింపులు తక్షణమే చేపట్టాలన్నారు. సమావేశంలో డీఆర్ఓ బీసీహెచ్ ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్, మార్కాపురం, కనిగిరి సబ్ డివిజనల్ రెవెన్యూ అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

- ఊపిరి పీల్చుకున్న విద్యాశాఖ అధికారులు



సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు హాజరైన అభ్యర్థులు

ఒంగోలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ శుక్రవారం రాత్రి ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఒంగోలు రూరల్ మండల పరిధిలో చెరువుకొమ్ముపాలెం శ్రీ సరస్వతి విద్యాసంస్థలకు చెందిన భవన సముదాయంలో చేపట్టిన ఈ వెరిఫికేషన్ చిన్నపాటి సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ ప్రశాంతం గా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాకు మంజూరు చేసిన 629 పోస్టులకు తోడు 29 జోనల్ స్థాయి పోస్టులకు సంబంధించి 1:1 దామాషాలో ఈ ప్రక్రియ చేపట్టారు. మేరకు 13 గదులకు ఒక ఎంఈఓ, హెచ్ఎం, డిప్యూటీ తహసీల్దార్, సాంకేతిక సిబ్బందిని 13 టీంలుగా ఏర్పాటు చేసి వెరిఫికేషన్ పూర్తి చేశారు. మొత్తం 658 మంది అభ్యర్థులకు గాను 651 మంది ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశారు. మిగిలిన ఏడుగురు అభ్యర్థుల్లో ముగ్గురు అభ్యర్థులు నాట్ విల్లింగ్ ఇచ్చారు. మిగిలిన నలుగురు అభ్యర్థులకు శనివారం వెరిఫికేషన్ చేయనున్నట్లు డీఈఓ కిరణ్‌కుమార్ తెలిపారు. డీఎస్సీ జిల్లా పరిశీలకులు విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ తెహర సుల్తానా, స్పెషల్ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, డీఈఓ ఎ కిరణ్ కుమార్ పర్యవేక్షణలో చేపట్టిన కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్, డీసీఈబీ సెక్రటరీ ఎం శ్రీనివాసరావు, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు ఎంఈఓలు కిషోర్ బాబు, శివాజీ, నాగేంద్ర వదన్ పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుప్తనిధుల తవ్వకాల కేసులో ఆరుగురికి సంకెళ్లు

- పరారీలో మరో నలుగురు
- నిందితుల వివరాలు వెల్లడించిన పోలీసులు



నిందితులను మీడియా ఎదుట ప్రవేశ పెట్టిన పోలీసులు

హనుమంతునిపాడు: వివిధ ఆలయాల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన కేసులో ఆరుగురు నిందితులకు పోలీసులు శుక్రవారం సంకెళ్లు వేసి వారిని మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ కథనం ప్రకారం..హనుమంతునిపాడు మండలం నందనవనం పంచాయతీ వెలుగొండపై మల్లప్పచల శివాలయం, రంగనాయకులు స్వామి గుడిలో గుప్త నిధుల కోసం కొందరు తవ్వకాలు జరిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు అప్రమత్తమై కేసు నమోదు చేసి వివరాలు సేకరించారు. కనిగిరిలో వైఎస్సార్ విగ్రహం సమీపంలో నిందితులు ఉన్నట్లు గమనించి హనుమంతునిపాడు ఎస్సై మాధవరావు తన సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. నిందితుల్లో గిద్దా ఏడుకొండలు, కండె మధుబాబు, సుంకిశాల రీగన్, పాలపర్తి రాజు, షేక్ పచ్చావలి, ఏముల ఏడుకొండలు ఉన్నారు. ఇదే కేసులో మరో నలుగురు పరారీలో ఉన్నారు. వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ విశ్వాసం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీతో పాటు సీఐ షేక్ ఖాజావలి, ఎస్సై మాధవరావు ఉన్నారు.

నేడు సవరణకు గడువు ముగింపు



ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తర్లుపాడు: 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని కలుజువ్వలపాడు పీఎం శ్రీజవహర్ నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు పొరపాట్లను సరిచేసుకునేందుకు శనివారం చివరి అవకాశమని ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నమోదులో ఏమైనా పొరపాట్లు ఉంటే సవరించుకోవాలని చెప్పారు. ఆరో తరగతిలో ప్రవేశానికి పశ్చిమ ప్రకాశంలోని 27 మండలాల నుంచి 7,114 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 3,539 మంది బాలురు కాగా 3,574 మంది బాలికలు ఉన్నట్లు చెప్పారు. శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మార్కాపురం డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ నాసరయ్య హాజరై విద్యార్థులకు హాకీ ఆటగాడు మేజర్ ధ్యాన్ చంద్ జీవిత చరిత్ర గురించి వివరించారు. విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి తగ్గిపోతుందని, చదువులో రాణించాలంటే విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నాసరయ్యను నవోదయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

బేస్తవారిపేట: భార్య మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన బేస్తవారిపేటలో శుక్రవారం జరిగింది. స్థానిక బీసీ కాలనీలో బూతపాటి జగన్ (30) కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన జగన్ మద్యం తాగేందుకు భార్య దానమ్మను గురువారం రాత్రి డబ్బులు అడిగాడు. డబ్బులు లేవని భార్య చెప్పడంతో ఇంట్లో ఉన్న సూపర్ వాస్మల్ (తలకు వేసే రంగు)తాగాడు. పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- బేస్తవారిపేటకు చెందిన ఓ యువకుడు మద్యానికి డబ్బు ఇవ్వలేదని శుక్రవారం తన భార్యతో గొడవపడి వాస్మాల్ తాగి తనువు చాలించాడు.
- నెల రోజుల క్రితం ముండ్లమూరు మండల పర్యటనకు వెళ్లిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు బెల్ట్ షాపుల దందా గురించి మహిళలు నేరుగా ఫిర్యాదు చేశారు. పక్కనే ఉన్న టీడీపీ నేతలు అదేమీ లేదంటూ కలెక్టర్‌నే బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించారు. అంతటితోనే ఆ ఫిర్యాదు బుట్టదాఖలైంది.
- దొనకొండలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని ఇటీవల దర్శి ఎక్సైజ్ ఎస్సై అదుపులోకి తీసుకోగానే 5 కార్లలో స్టేషన్‌పై దండయాత్ర చేశారు టీడీపీ నాయకులు. ఏకంగా ఎస్సైని బూతులు తిడుతూ ఉద్యోగమెలా చేస్తావో చూస్తామని బెదిరించిన తీరు తీవ్ర చర్చనీయాంశమైంది.
- తర్లుపాడు మండలంలోని ఓ గ్రామంలో బెల్ట్ షాపులో మద్యం తాగుతున్న వ్యక్తులను ఎక్సైజ్ సిబ్బంది గుర్తించారు. వారి నుంచి అంతో ఇంతో డబ్బు గుంజేందుకు ప్రయత్నించారే గానీ దుకాణాన్ని తనిఖీ చేయలేదు. ఎవరిపైనా కేసు కట్టలేదు.
- మార్కాపురం ఆర్టీసీ డిపోలో మంచినీటి కుళాయిల వద్ద మందుబాబులు బహిరంగంగా మద్యం తాగుతున్న ఫొటోలు గురువారం సోషల్ మీడియాలో వైరగా మారాయి.

సమాజంపై మద్యం చూపుతున్న ప్రభావం, కూటమి సర్కారు నిర్లక్ష్యం, అధికారుల తీరు, బెల్ట్ బాబుల దోపిడీని ఈ సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి.

ఊళ్లకు బెల్ట్ ఉచ్చు.. కుటుంబాల్లో చిచ్చు!

- బడ్డీ కొట్లలా వెలుస్తున్న మద్యం బెల్టు షాపులు
- వేళాపాల లేకుండా యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- ఒక్కో బెల్ట్ బాబుకు రోజూ రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు లాభం
- నిర్వాహకులు కూటమి నేతలు కావడంతో కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు

మద్యం మహమ్మారి ఉచ్చులో చిక్కుకుని ఊళ్లకు ఊళ్లు గుల్లవుతున్నాయి. మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్న కూటమి నాయకులు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. అన్ని వేళల్లో మద్యం అందుబాటులో ఉంటుండటంతో పూటుగా తాగిన మందుబాబులు వీధుల్లోనే పొర్లాడుతూ కుటుంబ సభ్యుల పరువు బజారున పడేస్తున్నారు. మద్యం కొనేందుకు డబ్బు కావాలని తల్లిదండ్రులను రాచిరంపాన పెట్టడమే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మద్యం అడ్డగోలు విక్రయాలను నియంత్రించాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సందట్లో సడేమియా అన్నట్టుగా బెల్ట్ బాబులను బెదిరించి కొందరు ఎక్సైజ్ అధికారులు ఆమ్యామ్యాలు గుంజుతున్నట్లు ఆరోపణలున్నాయి.

మార్కాపురం టౌన్:

మద్యం మహమ్మారి పల్లెల్లో అశాంతి రేకెత్తించడమే కాకుండా యువత ప్రాణాలు తీస్తోంది. కూటమి గద్దెనెక్కగానే ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించి సొంత పార్టీ నేతలకు దండిగా ఆదాయం సంపాదించుకునేందుకు రాచబాట వేసిన సంగతి తెలిసిందే. మొత్తం మద్యం దుకాణాలను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు కట్టబెట్టిన ప్రభుత్వం గ్రామాల్లో బెల్ట్ షాపులను తెరిచేందుకు ప్రత్యక్షంగానే కారణమైంది. నూతన మద్యం పాలసీపై విమర్శలు వెల్లువెత్తుతున్నా కూటమి ప్రజాప్రతినిధులు ఏమాత్రం ఖాతరు చేయకపోగా లైసెన్స్‌డ్ దుకాణాల నిర్వాహకులతో బేరం కుదుర్చుకున్నారన్న విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

సందుకొకటి.. గొందికొకటి!

కూటమి పార్టీల ఎమ్మెల్యేల ఆశీస్సులతోనే జిల్లాలో 1050కి పైగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రతి గ్రామంలో బడ్డీ కొట్లలా బెల్టుషాపులు వెలుస్తుండటం కూటమి ప్రభుత్వ ఉదాసీన వైఖరిని స్పష్టం చేస్తోంది. గ్రామాల్లో రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు వేలం పెట్టి మరీ బెల్ట్ షాపులు నిర్వహించుకునే వారిని ఎంపిక చేస్తున్నా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల నుంచి నేరుగా బెల్ట్ షాపులకు ఆటోలు, ఇతర వాహనాల్లో మద్యం తరలిస్తున్నా ఎక్సైజ్ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారన్నా ఆరోపణలున్నాయి. బెల్టుషాపుల నిర్వాహకులంతా కూటమి పార్టీల సానుభూతిపరులే కావడంతో దాడులు చేయడానికి ఎక్సైజ్ అధికారులు జంకుతున్నట్లు తెలుస్తోంది. మార్కాపురం మండలంలో 21 పంచాయతీలు ఉండగా సుమారు 16 గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఇదే పరిస్థితి జిల్లాలోని ప్రతి మండలంలోనూ నెలకొంది. బెల్ట్ షాపుల్లో మద్యం ఎమ్మార్పీ ధరలపై అదనంగా రూ.50 తీసుకుని అమ్ముతూ రోజుకు రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు నిర్వాహకులు పోగేసుకుంటున్నారు. ఈ సొమ్ములో ఎవరి వాటాలు వారికి పంపుతూ బెల్ట్ షాపులు దర్జాగా నిర్వహిస్తున్నారు.

మద్యం డోర్ డెలివరీ

ఒంగోలు, పొదిలి, మార్కాపురం, గిద్దలూరు, చీమకుర్తి తదితర పట్టణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలు బైక్‌ల పైనే సాగిస్తున్నారు. అర్ధరాత్రి వేళ సైతం ఫోన్ చేయగానే మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారని స్థానికంగా చర్చ నడుస్తోంది. బడ్డీకొట్లలా ఏర్పాటైన మద్యం దుకాణాల్లో తగిన వసతులు కల్పిస్తూ మందుబాబులను మరింతగా ప్రోత్సహించే సంస్కృతి పల్లెల్లో పెరిగిపోయింది. మార్కాపురం ఎస్టేట్‌లో ప్రధాన రోడ్డుపైనే బెల్టుషాపులు నిర్వహిస్తూ, నాటుసారా విచ్చలవిడిగా విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు అటు వైపు కూడా కన్నెత్తి చూడటం లేదు.



మార్కాపురం పూల సుబ్బయ్య కాలనీ ధాబాల్లో మద్యం అమ్మకాలు



బోడపాడులో అనధికార బెల్టుషాపు

దాబాల మాటున మద్యం విక్రయాలు

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డు, కర్నూలు రోడ్డు, మార్కాపురం, గిద్దలూరు, పొదిలి ప్రాంతాల్లోని పలు దాబాల్లో మద్యం ఏరులై పారుతోంది. టీడీపీ ఎమ్మెల్యేలు, స్థానిక కూటమి నాయకుల అండతో నిర్వహిస్తున్న ఈ దాబాలను పోలీసులు కూడా చూసీచూడనట్టుగా వదిలేయడంపై విమర్శలొస్తున్నాయి. కొన్ని దాబాల్లో ఆహారంతోపాటు అధిక ధరకు మద్యం విక్రయిస్తుండగా, మరికొన్ని చోట్ల మద్యం తెచ్చుకుని తాగేందుకు యథేచ్ఛగా అనుమతిస్తున్నారు. మార్కాపురం పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 10కి పైగా దాబాలు ఇదే రీతిలో నడుస్తున్నాయి.

అడ్డగోలుగా పర్మిట్ రూమ్‌లు

- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వైనం
- వాటాలు ముడుతుండటంతో ఎక్సైజ్ శాఖ గప్‌చుప్



పొదిలిలో ఓ మద్యం దుకాణంలో అనుమతి లేని పర్మిట్ రూం

పొదిలి: జిల్లాలో మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లను అనుమతి లేకుండా నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.7.50 లక్షలు, రూ.5 లక్షలు రెండు స్థాయిల్లో రుసుం చెల్లించాలని నిర్ణయించిన కూటమి ప్రభుత్వం ఇటీవలే జీఓ జారీ చేసింది. అయితే అంతకంటే ముందు నుంచే పర్మిట్ రూమ్‌లు నిర్వహిస్తున్న కొందరు దుకాణదారులు.. తాజా జీవో తర్వాత ప్రభుత్వానికి పైసా కూడా చెల్లించలేదని సమాచారం. పొదిలి మండలంలో ఆరు దుకాణాలు ఉండగా ఒక లైసెన్స్‌దారుడు మాత్రమే రూ.7.50 లక్షలు చెల్లించారు. కానీ అన్ని దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. స్థానిక ఎక్సైజ్ సీఐ మాత్రం పొదిలిలో ఎక్కడా పర్మిట్ రూమ్‌లు లేవని చెప్పడం గమనార్హం.

గణేశ్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

- ఎస్పీ ఏఆర్ దామోదర్ వెల్లడి
- కొత్తపట్నం సముద్ర తీరంలో పరిశీలన



కొత్తపట్నం బీచ్‌లో నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

కొత్తపట్నం: వినాయక విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపట్నం బీచ్ ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. రాములవారి ఆలయం వద్ద పార్కింగ్ ప్రదేశం, సముద్ర తీరంలో బారికేడ్లు, నిమజ్జన ప్రదేశాలు, మైక్‌లు, లైటింగ్, వైద్యశిబిరాల ఏర్పాట్లను పరిశీలించి, స్థానిక అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో 1000కి పైగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని, తీరప్రాంతానికి 700 విగ్రహాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో బీచ్‌లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐదు డ్రోన్లతో పహారా కాయడంతోపాటు 15 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. సముద్రం లోపలికి భక్తులు, పర్యాటకులు వెళ్లకుండా ఇసుక బస్తాలతో హెచ్చరిక గుర్తులు పెట్టామన్నారు. చిన్న పిల్లలతో వచ్చే వారు జాగ్రత్తలు పాటించాలని, నిర్దేశిత సమయాల్లో విగ్రహాలను నిమజ్జనం చేయాలని సూచించారు. గజ ఈతగాళ్లకు టీషర్ట్‌లు పంపిణీ చేశారు. డీజే వాహనాలను కొత్తపట్నం బయటే ఆపేయాలని పోలీసులను ఆదేశించారు. ఎస్పీ వెంట మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎస్సై వేముల సుధాకర్‌బాబు, వెంకటకృష్ణయ్య, మెరైన్ ఎస్సై పి.సుబ్బారావు ఉన్నారు. అనంతరం కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తులో పురోగతి సాధించాలని ఎస్సైని ఆదేశించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

- నిందితుల నుంచి రూ.2.03 లక్షల నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఆరు బైకులు స్వాధీనం

టంగుటూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. టంగుటూరు మండలంలోని యర్రజర్ల గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఒంగోలు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుధాకర్, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. జూదం ఆడుతున్న తూర్పునాయుడుపాలెం గ్రామానికి చెందిన దామచర్ల అనిల్‌తో సహా ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.2.03 లక్షల నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఆరు బైకులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అయితే పట్టుబడిన వారిలో ఒంగోలు నగరానికి చెందిన కార్పొరేటర్లు ఉన్నారని సమాచారం.

తెలుగుభాష ఉద్యమ పితామహుడు గిడుగు

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



గిడుగుకు నివాళులర్పిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు సబర్బన్: తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి..అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ కొనియాడారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్లో ఆయన చిత్రపటానికి జేసీతో పాటు డీఆర్‌ఓ బి.చిన ఓబులేసు, ఇతర అధికారులు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మాతృభాష తెలుగు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చి నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియచెప్పిన మహనీయుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని కొనియాడారు. ఆయన జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. తాను సివిల్స్ పరీక్షలు సైతం తెలుగులోనే రాసిన విషయాన్ని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ప్రస్తావించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి రవి, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులకు డీఎంహెచ్‌ఓ హెచ్చరిక



ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో స్కానింగ్ విభాగాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. నగరంలోని పలు ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల రికార్డులు పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. వాటి రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రులను నిర్వహించే వారంతా తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2002 ప్రకారం రిజిస్టర్ చేసుకోవాలని ఆదేశించారు. పొల్యూషన్, ఫైర్, బయోమెడికల్ వేస్టేజీ అనుమతి పత్రాలు ఉండాలని చెప్పారు. ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, వాటి ఫీజుల వివరాలు తెలియజేసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఓపీ రిజిస్టర్, కేసు షీట్లు, ఇతర రిజిస్టర్‌లు నిర్వహించాలని చెప్పారు. తనిఖీల్లో డాక్టర్ శ్రావణ్‌కుమార్, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొలాల్లో పులి.. అప్రమత్తంగా ఉండాలి

బేస్తవారిపేట: గ్రామాల్లో పులి అడుగుజాడలు కనిపిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్‌ఓ మధుప్రియాంక సూచించారు. శుక్రవారం బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు, ఒందుట్ల, చెట్టిచర్ల, జేబీకే పురం, లక్ష్మీపురం గ్రామాల్లో పులి పాదముద్రలను గాలించారు. పులి, చిరుత పులి సంచరిస్తున్నట్లు పాదముద్రలు గుర్తించామన్నారు. దరగ కొండ నుంచి బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు పరిసర ప్రాంతాల్లోకి పులి వెళ్లినట్లు నిర్ధారణ అయిందన్నారు. రైతులు రాత్రి వేళల్లో పొలాలకు వెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కంచెల వద్ద వలలు, విద్యుత్ పెట్టవద్దని రైతులకు అవగాహన కల్పించారు. పశువులపై దాడి చేస్తే వాటి దగ్గరకు వెళ్లకుండా ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పలుచోట్ల ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓలు ఆనందరావు, రంగారెడ్డి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పులి పాదముద్రల కోసం గాలిస్తున్న ఫారెస్ట్ అధికారులు